

రోబోటిక్ ఆర్థో ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక నందం గనిరాజు జంక్షన్‌లో ఫిజియోథెరపిస్టులు డాక్టర్ టి.వినీత, డాక్టర్ కె.అనిల్ ఏర్పాటు చేసిన రోబోటిక్ ఆర్థో న్యూరో (ఆర్.ఎన్) రిహాబిలిటేషన్ ఆసుపత్రిని హోమ్ మంత్రి తానేటి వనిత సోమవారం ప్రారంభించారు. ఆర్థో న్యూరోలో రోబోటిక్ విధానాన్ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోబో ద్వారా వైద్య సేవలందించే విధానాన్ని జిల్లాలోనే మొదటిసారిగా ఇక్కడ ప్రవేశపెట్టిన వైద్యులు వినీత, అనిల్‌ను అభినందించారు. కొత్త ఆలోచనలకు పునాదులు వేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, అశోక్ కుమార్ జైన్, మరుకుర్తి రవి యాదవ్, హరి వెన్నెర్ల, వైద్యులు వినయ్ భూషణం, విజయ్ భూషణం టిడిపి నాయకులు ఆదిరెడ్డి వాసు, కాశి నవీన్‌కుమార్, పాల్గొన్నారు.

మండుటెండలో అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-ధవళేశ్వరం

తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం నాలుగు గంటలపాటు మండుటెండలో మహా ధర్నా నిర్వహించారు. తొలుత జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పెద్దఎత్తున తరలి వచ్చి మహాధర్నాలో పాల్గొన్నారు. సమస్యలు తెలిపేందుకు ఎంత సేపటికీ ఒక్క అధికారికూడా రానందున తామే అధికారుల వద్దకు వెళతామని చెప్పడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ తోసి కలెక్టరేట్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్‌వాడీల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్త చోటు చేసుకుంది. అనంతరం జిల్లా కలెక్టర్ 10 మంది ప్రతినిధి బృందంతో చర్చలకు ఆహ్వానించారు. యూనియన్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తొలుత మహా ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.మాణిక్యంబ, కార్యదర్శి కె.బేబిరాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు తెలంగాణలో ఇస్తున్న వేతనం కంటే అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తానని చెప్పి, నేడు తెలంగాణ రాష్ట్రం కంటే రూ.2000 తక్కువ వేతనాలు చెల్లిస్తూ మాట తప్పారన్నారు. కర్ణాటక ప్రభుత్వ సుప్రీంకోర్టు తీర్పు అంగన్‌వాడీ గ్రాట్యుటీ అమలు చేస్తూ జిఒ ఇచ్చిందని, జగన్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫుడ్ కమిషనర్ ప్రతాప్ రెడ్డి ప్రభుత్వానికి అసమానపరిస్తూ మాట్లాడడం మానుకోవాలని హెచ్చరించారు. వేతనాలే అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు పెట్టే మెనూ ఛార్జి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంవత్సరాల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే సెంటర్లను ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. కనీసం నెలనెలా వేతనాలు కూడా చెల్లించలేని దౌర్భాగ్య పరిస్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను రోజురోజుకీ పెంచుతూ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచుతుందని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, పౌష్టికాహారం అందించే ఐసిడిఎస్ బడ్జెట్‌లో నిధులు తగ్గించి పేద పిల్లలకు అన్యాయం చేశారని, గర్భిణులు, పిల్లలు తినగలిగేలా నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పేదలకు సేవచేసే అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫేస్ యాప్ రద్దు చేసేంతవరకు ఈ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. చేసే పని ఒకేలా ఉన్నా మినీ వర్కర్ అనే పేరుతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నారని, తక్షణమే మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. రాజకీయ వేధింపులతో తొలగించిన వారిని విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలకు అంగన్‌వాడీలు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మహాధర్నాలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, భాగత్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భాగ్యలక్ష్మి, ఆఫీస్ బేరర్స్ అన్నపూర్ణ, మత్స్యమ్మ, సూర్యకాంతం, రామలక్ష్మి, వై.సుజాత, సుబ్బలక్ష్మి, శారద, కల్యాణి, ఎం.మార్థమ్మ, మాలతి, దుర్గాంబ, మేరీ, లక్ష్మి అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

బాలోత్సవంతో పిల్లల్లో సృజనాత్మకత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవాలు ఎంతగానో దోహదం చేస్తున్నాయని ఎంఎల్‌సి షేక్ సాబ్జి అన్నారు. నగరంలోని హోటల్ జగదీశ్వరిలో గోదావరి బాలోత్సవం బ్రోచర్‌ను సోమవారం పిఎస్ఎన్ రాజు అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేవరపల్లి, పేలపూరి ప్రాంతాల్లో నిర్వహించిన బాలోత్సవం కార్యక్రమాలకు అద్భుతమైన స్పందన వచ్చిందని అన్నారు. ఆ కార్యక్రమాల స్ఫూర్తితో ఈ నెల 25, 26 తేదీల్లో రాజమహేంద్రవరం వేదికగా జరిగే గోదావరి బాలోత్సవానికి తన సహకారాన్ని అందిస్తానని తెలిపారు.

ఆహ్వాన కమిటీ ఏర్పాటు

గోదావరి బాలోత్సవం ఆహ్వాన కమిటీ ఏర్పాటు అయింది. కమిటీ గౌరవాధ్యక్షునిగా షేక్ సాబ్జీ, గౌరవ సలహాదారుగా వి.భాస్కర రామ్, అధ్యక్షులుగా తిరుమల విద్యా సంస్థల అధినేత నున్న తిరుమలరావు, గౌరవ సలహాదారులుగా ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షునిగా రిటైర్డ్ ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.ఎం.ఆర్.శేఖర్, ప్రధాన కార్యదర్శిగా పిఎస్ఎన్‌రాజును నియమించారు.

క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రతి ఒక్కరూ విద్యతోపాటు, క్రీడారంగంలోనూ రాణించడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఆస్కారం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు ఆలీ అన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పిఎల్) క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఆలీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ ఐపిఎల్‌కు ఏమాత్రం తగ్గకుండా ఆర్‌పిఎల్‌ను నిరాటంకంగా కొనసాగిస్తున్న మాజీ కార్పొరేటర్, ఆర్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ చైర్మన్ అజ్జరపు వాసు, ఆయన మిత్రబృందాన్ని ఆయన అభినందించారు. ఆర్ట్స్ కళాశాల మైదానానికి ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడ నుంచి తన ప్రస్తానాన్ని ప్రారంభించిన వారు ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే ఆర్‌పిఎల్ ఆడిన ఇద్దరు క్రీడాకారులు ఐపిఎల్‌కు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్, అజ్జరపు వాసు, కుంచే శేఖర్‌ను వారు అభినందించారు. తొలుత మంజీరా నుంచి భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎంఎల్‌ఎ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ రౌతు పార్థసారథి, డాక్టర్ కృష్ణారావు, వైసిపి నాయకుడు నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఆలీ

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని పక్కా ప్రణాళికతో ఉన్నత శిఖరాలకు అధిరోహించాని కలెక్టర్ మాధవీలత సూచించారు. మలబార్ గోల్డ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ ప్రోగ్రాం కింద 24 ప్రభుత్వ కళాశాలల్లో 406 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్స్ మంజూరు చేసంది. సోమవారం వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.37.52 లక్షల స్కాలర్‌షిప్స్‌ను కలెక్టర్ మాధవీలత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణతో పాటు మౌలిక సౌకర్యాలను కల్పించిందన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, బిసి రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని, విద్యార్థులు అభివృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షిం చారు. మలబార్ రాజమండ్రి స్టోర్ హెడ్, కె.ఫెబిన్, మేనేజర్, కె.వెంకటలక్ష్మీపతి పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలెక్టర్ మాధవీలత

త్వరితగతిన మెయిన్ రోడ్డు పనులు


రాజమహేంద్రవరం : నగర ప్రధాన సెంటర్ మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన నగరంలోని అజంతా హోటల్ నుంచి వన్ టౌన్ పోలీసు స్టేషన్ వరకూ కార్పొరేషన్ అధికారులు, పార్టీ నేతలతో కలిసి మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారిపై పడిన పెద్ద పెద్ద గుంతలను పూడ్చే పనులను తొలుత చేపట్టారు. 15 రోజుల్లో తారు రోడ్డు పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ ఎస్ఇ పాండురంగారావు తెలిపారు.

టిడిపి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి

ప్రజాశక్తి-నిడదవోలు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి కార్యకర్తా కృషజ చేయాలని మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ విస్తత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదేం ఖర్మ కార్యక్రమం షెడ్యూల్, సెక్షన్ ఇన్‌ఛార్జ్‌ల నియామకం, ఓటర్ లిస్టు వెరిఫికేషన్ గురించి చర్చించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు వెలగన సూర్యారావు, మాజీ జెడ్‌పిటిసి కోమట్లపల్లి సుబ్బారావు, సింహాద్రి రామకష్ణ, భూపతిరాజు రవివర్మ, అటికాల రామకష్ణమ్మ పాల్గొన్నారు ఈ సమావేశంలో కోరుపల్లి గ్రామ సర్పంచ్ గుత్తుల నాగలక్ష్మి , గుత్తుల రాధాకృష్ణ, వెదుళ్లపల్లి శ్రీను వైసిపి నుంచి టిడిపిలో చేరారు.

కార్టూ'నిజం'



ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారు..!!

దొండపూడి రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం నుంచి దొండపూడి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా మరమ్మతులు మాత్రమే చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 12 కిలోమీటర్ల మేర రోడ్డుకు టిడిపి ప్రభుత్వంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు మాత్రం ప్రారంభించలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిధులు మంజూరయ్యాయని ప్రజాప్రతినిధులు పలుమార్లు తెలిపారు. దీంతో పలువురు వాహన చోదకులు గ్రామస్తులు ఆనందం హర్షం చేశారు. సుమారు మూడున్నరేళ్లుగడుస్తున్నప్పటికీ నేటి వరకు ఆ రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు నిరాశతో ప్రయాణికులు అవస్థలు పడుతూనే ఉన్నారని అన్నారు. ప్రస్తుతం కొత్త రోడ్డు నిర్మాణ పనులు పక్కనపెట్టి కేవలం మరమ్మతులు ప్రారంభించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రోడ్డుకు నిధులు మంజూరైనప్పటికీ తూతూ మంత్రంగా మరమ్మతులు మాత్రమే చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేసిన కొద్ది రోజులకే మళ్లీ భారీ గోతులు పడి యథాస్థితికి రోడ్డు వస్తుందని, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరారు. ఇంతకుముందు కూడా మరమ్మతులు చేసినప్పటికీ అతి తక్కువ సమయంలో రోడ్డు యథాస్థితికి వచ్చి ప్రయాణం చేయాలంటేనే తీవ్ర ఇబ్బందులు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసిపిలోకి బొల్లెద్దుపాలెం సర్పంచ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మండలంలోని బొల్లెద్దుపాలెం సర్పంచ్, టిడిపి నాయకుడు కురుమెళ్ల వెంకటరామకృష్ణ ఆ పార్టీనివీడి వైసిపిలో చేరారు. స్థానిక ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సమక్షంలో సోమవారం సర్పంచ్ రామకృష్ణ, టిడిపికి చెందిన సుమారు 50 మంది వైసిపిలో చేరారు. వీరిని ఎంఎల్‌ఎ రాజా పార్టీ కండువావేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా రాంబాబు, కర్రి నాగేశ్వరరావు, అడపా కనకరాజు, క్రొవ్విడి సత్రాజు, పూసలు మహేష్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని 33/11 కెవి ఊనగట్ల సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

చంద్రబాబు పర్యటనపై ఏర్పాట్లు

ప్రజాశక్తి-బిక్కవోలు

ఈ నెల 17, 18 తేదీల్లో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సన్నాహక ఏర్పాట్ల గురించి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం నాయకులతో చర్చించారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రజకుల సమస్యలపై దృష్టి

ప్రజాశక్తి- ధవళేశ్వరం

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి రూరల్ కో ర్డినేటర్ చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. సోమవారం రజకులతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలను విని వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గొల్లపేట రజకుల ఘాట్‌ను పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ కోసం ఇరిగేషన్ ఇంజనీర్‌తో మాట్లాడి మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాదనాల శివ, సరితా రాణి, రజక సంఘం అధ్యక్షులు కొమ్మంటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఊళ్లేటి సత్యనారాయణ, కార్యదర్శి కోరుమిల్లి నాగరాజు పాల్గొన్నారు.

320 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్, కంటికి సంబంధించి సుమారు 320 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కొంతమంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. 15 మందికి కంటికి సంబంధించి శుక్లాలు తీయడానికి వేమగిరి పరమహంస యోగానంద ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సత్యం రమేష్ బాబు, డాక్టర్ యన్నముని రామచంద్రరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాసరావు, వెంకటనారాయణ, సురేష్ బాబు, ప్రసన్న, వీరభద్రరాజు, వెంకటలక్ష్మి, విజయ్ కుమార్, శ్రీనివాసరావు, చంటిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, నిడదవోలు

ఎనిమిదిన్నరేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని ఎపి కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ధ్వజమెత్తారు. ఎల్ఐసి, ఎస్‌బిఐలకు నష్టం చేకూరేలా వాటి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిన అదానీ సంస్థపై వచ్చిన ఆర్థిక ఆరోపణలపై విచారణ చేయకుండా ఇంకా వారికి కొమ్ముకాయడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్‌లో ఉన్న ఎల్ఐసి కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. బిజెపి, అదానీకి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఎఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గతంలోనే పెద్దఎత్తున మనీ లాండరింగ్ జరుగుతోందని దీని వల్ల దేశానికి తీవ్రమైన ఆర్థిక నష్టం జరుగుతుందని హెచ్చరిస్తూ వస్తున్నారన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక అన్ని విషయాలనూ బహిర్గతం చేసిందని, కేంద్ర ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని అన్నారు. ఎల్ఐసి, ఎస్‌బిఐలో పేద, మధ్య తరగతి ప్రజలు దాచుకున్న సొమ్మును అక్రమంగా మళ్లించడం వల్ల చాలా కుటుంబాలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. అదానీ గ్రూప్ అక్రమ వ్యాపారాలపై సిబిఐతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలేపల్లి మురళీధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్, వడయార్, జ్యేష్ఠ సతీష్‌బాబు, ముళ్ల మాధవ్, బెజవాడ రంగారావు పాల్గొన్నారు. నిడదవోలులో ఎల్ఐసి ఆఫీస్ వద్ద నిరసన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి చిన్నం మురళీకష్ణ, జిల్లా కార్యదర్శి అగర్వాల్ హీరాలాల్, పట్టణ అధ్యక్షులు కారింకి వెంకటేశ్వరరావు, జివివి. సత్యనారాయణ, కొణిజేటి వెంకటనారాయణ, హుస్సేన్ జహ, పుచ్చకాయల వరప్రసాద్, షేక్ జిలానీ, అధికారుల బలరాం, కాకి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తంటికొండలో ఆకుమూరి వెంకటేశులు, ఆకుమూరి పండుకు చెందిన తాటాకిల్లు ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యింది. ఇల్లు పూర్తిగా దగ్ధమైన కారణంగా రెండు కుటుంబాలు కట్టుబాటులతో మిగిలాయి. విషయం తెలుసుకున్న గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు దంపతులు సోమవారం బాధితులు ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. మూడు బస్తాల బియ్యం, నిత్యావసర సరుకులు రూ.3 వేల నగదు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సుంకర వీరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందజేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బదిరెడ్డి సత్యనారాయణమ్మ అప్పన్న దొర వైస్ ఎంపిపి మడికి మైనర్ బాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి రాంబాబు, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆర్ఐ.శ్రీరాములు, పంచాయతి సెక్రటరీ గనిరాజు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-గోపాలపురం

విజయవాడ స్వరాజ్యమైదానంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం కూడా పెట్టాలని ఎపి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మార్కెట్ కమిటీ ఆవరణలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పక్కనే డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. బాబాసాహెబ్ బిఆర్.అంబేద్కర్ అంటరాని బతుకుల విముక్తి కోసం పోరాడి వారి కోసం విద్యా ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు రాజ్యాంగంలో ప్రతిపాదిస్తే ఆ రిజర్వేషన్లు అమలు చేయడంలో జగ్జీవన్‌రామ్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. మార్చి 24న విజయవాడ ఐలాపురం హాల్లో దళిత గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కొడవటి బుజ్జిబాబు, బొబ్బిలి వెంకటరాజు, సృజనారావు, ప్రత్తిపాటి రాంబాబు, గెల్లా వెంకట శ్రీనివాస్, మల్లిపూడి సలీం, సుందరావు పాల్గొన్నారు.

బత్తిన సేవలు అందరికీ ఆదర్శనీయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేదలకు విశేష సేవలందించిన మహనీయుడు బత్తిన సుబ్బారావు సేవలు, ఆశయాలు చిరస్మరణీయమని వైసిపి ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద బత్తిన సుబ్బారావు జయంత్యుత్సవం మున్సిపల్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్ బత్తిన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎంపీ మాట్లాడుతూ ఆ కాలంలోనే ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు, పేదలందరికీ ఇళ్ల పట్టాలను అందజేసి, సొంతింటి కలను బత్తిన నెరవేర్చారన్నారు. పేదల సంక్షేమానికి బత్తిన చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు.



శిక్షణ తరగతులలో మాట్లడుతున్న శ్రీనివాసరావు

స్వయం ఉపాధి శిక్షణ ప్రారంభం

ధవళేశ్వరం : వికలాంగులకు వ్యాపార అభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సోమవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమం పది రోజులపాటు జరగనున్నట్టు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి, కాకినాడ, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల వారు దరఖాస్తు చేసుకొని శిక్షణ తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సుమిత్, ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్యం అధ్యక్షుడు సురేష్, ప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఉండ్రాజవరం : మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపుల్లో ప్రజలు తమ ఆధార్ కార్డుల్లో సవరణలు, అప్‌డేట్‌లు, మార్పులు చేర్పుల కోసం వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ తెలిపారు. వేలివెన్ను లో మంగళవారం, పసలపూడిలో బుధవారం, పాలంగిలో గురువారం, మోర్తలో శుక్రవారం ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

వైఎస్ఆర్ బీమా చెక్కుల పంపిణీ

గోకవరం : మండలంలో 15 మందికి వైఎస్ఆర్ బీమా కింద రూ.15 లక్షల చెక్కులను ఎంపిపి సుంకర శ్రీవల్లి, జెడ్‌పిటిసి దాసరి శ్రీరంగ రమేష్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు, అనిల్‌కుమార్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొలెరో వాహనంపై లారీ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట - కాకినాడ రోడ్‌లో లాకుల వద్ద ఉండూరు రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి బొలేరో వాహనంపై బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ వెనక భాగం పూర్తిగా పాడైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. పెద్దాపురంలోని ఒక రైస్ మిల్ నుంచి బియ్యం లోడుతో కాకినాడ పోర్ట్‌కు వెళ్తున్న లారీ ఉండూరు రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి అటుగా వెళుతున్న బొలేరో వాహనంపై బోల్తా పడింది. ఆ బొలేరో వాహనంలో ఉన్నవారు, లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వల్ల కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రమాద స్థలానికి స్థానిక పోలీసులు చేరుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

చోరీల కేసులో ఇద్దరు అరెస్టు

54 సెల్ ఫోన్లు, 9 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో సెల్‌ఫోన్లు, బైకులు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రత్తిపాడు సిఐ కె.కిషోర్‌బాబు తెలిపారు. తుని రూరల్ మండలం కొలిమేరుకు చెందిన బొందల అప్పారావు, ఎస్.కోట మండలం కొత్తవలసకు చెందిన బోదల సురేష్ చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లో బైకులు, తుని, అన్నవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల మాదిరిగా ట్రైన్ ఎక్కి ఛార్జింగ్ పెట్టుకున్న సెల్ ఫోన్లను దొంగిలించి తక్కువ ధరలకు అమ్మే వారన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు కె.సుధాకర్, జి.సతీష్, ఎఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది గోవింద్, ఎవిజి.కృష్ణ, సూర్యచంద్ర, సుబ్రహ్మణ్యం టీమ్‌గా ఏర్పడి ప్రత్యేక నిఘా ఉంచి చాకచక్యంగా దొంగలను పట్టుకున్నారని తెలిపారు. వీరిని ఎస్‌పి రవీంద్రబాబు. ఎఎస్‌పి పి.శ్రీనివాస్, పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ ప్రత్యేకంగా అభినందించారు..

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు ఏలేరు నది పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఏలేశ్వర ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీ నిమిత్తం నిల్వ ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి డ్రమ్ములను తగలబెట్టామన్నారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీకి యత్నించిన ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

జనవరి 17న స్థానిక కంచి సంస్థాన చైర్మన్ బ్రహ్మశ్రీ చంద్రాభట్ల చింతామణిగణపతిశాస్త్రి ఇంట్లో గుప్త నిధుల వేట గురించి దొంగతనానికి వచ్చిన ఏడుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు..భీమవరం, బలుసుముడి ప్రాంతానికి చెందిన సితిని అర్జునరావు(43), రౌతులపూడి మండలం పైడిపాల గ్రామానికి చెందిన ఎలుగుబంటి సురేష్(39), జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన బూసాల బాబూరావు(44), రాజపూడి సాయి బాబా గుడి ప్రాంతానికి చెందిన కందుల దొరప్రసాద్(61), విజయ నగరం పట్టణం గాజుల రెగా ప్రాంతానికి చెందిన పింద్రాల అప్పన్న (32), విజయనగరం అంబేద్కర్ కాలనీకి చెందిన ఆసనాల గోవింద్ (28), ఏలూరు జిల్లా కామవరపు పేటకు చెందిన గంటా యుగంధర్‌లను అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు తరలించామన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం, మండల పరిధిలో సోమవారం పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి స్వాతి సామర్లకోట పట్టణంలోని శ్రావణి ఎరువుల దుకాణాన్ని, మండలంలోని వేట్లపాలెంలో సత్యసాయి ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. మండలంలో సక్రమమైన పద్ధతిలోనే ఎరువుల దుకాణాలు నిర్వహణ కొనసాగుతోందని ఎలాంటి లోపాలు తమ దృష్టికి రాలేదని ఆమె వివరించారు. ఈ తనిఖీల్లో ఇంకా మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, ఎఎఒలు సతీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం - రక్షించిన స్థానికులు

మామిడికుదురు : పాశర్లపూడి - బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు రక్షించారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన నాగళ్ల సత్తిబాబు మానసిక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరిలో దూకాడు. సమీపంలో చేపల వేటకు వెళ్లిన మత్యకారులు కొల్లు నాగకృష్ణ, రాకేష్ వర్మ, నాని దీన్ని గుర్తించారు. నీటిలో దూకి సత్తిబాబును రక్షించారు. అనంతరం నగరం ఎస్ఐ ఎస్‌కె. జానీభాషా సమాచారం ఇచ్చారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, వేలివెన్ను గ్రామాల్లో పేకాట శిబిరాలపై సోమవారం దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.47,700నగదు, 11 సెల్ ఫోన్లు, కొన్ని పేకముక్కలు, స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.రామారావు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు స్టేషన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. జూదాలను నిర్వహించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. రెండు సార్లు జూదాల్లో దొరికితే ఉన్నత అధికారుల అనుమతితో షీట్స్ ఓపెన్ చేస్తామన్నారు.



నాసిరకంగా సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని సిరిపల్లి పంచాయతీ పరిధిలోని చెల్లేవారిపేటలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు వేయడానికి వేస్తున్న సిమెంట్ మాల్‌లో గ్రావెల్ రాళ్ళు, ఇసుక మాత్రమే కనిపిస్తున్నాయని, సిమెంట్ ఎక్కడా కానరావట్లేదని స్థానికులు తెలిపారు. ఇలా వేయడం వల్ల నెలరోజులకే రోడ్డు బీటలు వారి గుంతలు పడుతున్నాయని వాపోతున్నారు. నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

శబ్ధ కాలుష్యంపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఏడిద రోడ్డులోని దుర్గమ్మ ఆలయం పక్క వీధిలో ఉంటున్న ప్రజలు శబ్దకాలుష్యంపై ఫిర్యాదు చేశారు. వీధిలో కొత్తగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశారని రాత్రి పగలు పెద్ద శబ్దాలతో పనులు చేస్తున్నారని వి.రామకృష్ణ, శ్రీను, చౌదరి మున్సిపల్ అధికారులకు తెలిపారు. రాత్రి సమయంలో నిద్ర పోవడానికి ఇబ్బందులతో పాటు విద్యార్థులు పరీక్షలు సమయం కావడంతో వారి చదువులకు ఆటంకాలు ఏర్పడుతుందని వారిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవగాహనతోనే పరీక్షల్లో విజయం

ఎపిఎ ఇండియా అధ్యక్షుడు కృష్ణ భరత్


పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణభరత్

ప్రజాశక్తి-రాజోలు

పరీక్షలో విద్యలో భాగమని, సరైన అవగహన ఉంటే వాటిల్లో విజయం సాధించడం కష్టమైన పని కాదని ఎపిఎ ఇండియా అధ్యక్షుడు, సైకాలజిస్ట్ కృష్ణభరత్ పేర్కొన్నారు. సోమవారం సైకాలజిస్టుల సంఘం ఎపిఎ ఇండియా ఆధ్వర్యంలో మలికిపురంలోని ఎంవిఎన్‌జెస్ అండ్ ఆర్‌వి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 10వ తరగతి విద్యార్థులకు విజయీభవ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ కృష్ణభరత్ మాట్లాడుతూ పరీక్షల పట్ల భయాన్ని వీడితే సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. పరీక్షలు ప్రతిభకు కొలమానం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. పరీక్షలను విద్యలో భాగంగానే చూడాలన్నారు. సబ్జెక్ట్‌ను గుర్తు పెట్టుకోవడానికి ఎలా చదవాలి, పరీక్షల ముందు రోజు, పరీక్ష రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఎపిఎ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సైకాలజిస్ట్ ఎంపీ జానకిరామ్ మాట్లాడుతూ ప్రత్యేక పద్ధతుల్లో ప్రిపేర్ అయితే సబ్జెక్టులపై పట్టు సాధించొచ్చన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎపిఎ ఇండియా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పివివి.వరప్రసాద్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా రాష్ట్ర లోని పదో తరగతి విద్యార్థుల కోసం విజయీభవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సహకరించిన పాఠశాల కరస్పాండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి అనుసంధాన కర్తగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ నక్క రమేష్‌బాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంవి,సత్యనారాయణ మూర్తి, ఎపిఎ ఇండియా యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.తేజ, గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌వి.రమణారావు, ఉపాధ్యాయులు రామకృష్ణ, సూర్యనారాయణ, విజ్ఞాన్, వికాస్, గౌతమ్ గూడపల్లి, ఎఫ్‌బిటి, వివేకానంద పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం


మ్యాగ్‌జైన్స్ అందిస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

జి.రాగంపేట సచివాలయంలో సోమవారం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన వినియోగదారుల మ్యాగజైన్స్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సదస్సులో వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారులు మోసాలకు గురైతే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదుచేసి న్యాయం పొందొచ్చన్నారు. ఈ సదస్సులో సంఘం సెక్రటరీ ఎం.భాస్కర్‌రావు, కెవివి.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎన్‌టి.శేఖర్‌బాబు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ డి.అనిల్‌కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

సాగర్ కళాశాలలో శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

యువ చైతన్య సేవాసమితి, నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, తూర్పుగోదావరి జిల్లా క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సాగర్ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కమ్యూనిటీ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం,ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు వంటి వాటిపై శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. మొదటిరోజు శిక్షణ తరగతులలో సిడబ్ల్యూసి సభ్యులు జంగం సంతోషి లీడర్‌షిప్, వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం డిడి పిఆర్‌ఆర్ ప్రసాద్, ఫైర్ మాన్ సత్యనారాయణలు అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పి.శ్రీదేవి, జి.సాయికృష్ణ, ఎం.అచ్యుత రామయ్య, ప్రిన్సిపల్ బి.శ్రీను, వైస్ ప్రెసిడెంట్ నల్లా లీలావినోద్‌కుమార్, పోకల మణిమాల, సెక్రటరీ రాధా శ్రావణి, ఎన్‌వైకె వాలంటీర్లు పాల్గొన్నారు.

గేదెకు కేన్సర్ కణితి తొలగింపు

ప్రజాశక్తి-మండపేట


గేదెకు శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యులు

స్థానిక రాష్ట్ర పశుసంవర్ధక శాఖ శిక్షణ కేంద్రంలో పశు వైద్యాధికారులు పాడి గేదెకు శస్త్ర చికిత్స చేసి కేన్సర్ కణితిని సోమవారం తొలగించారు. ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామస్తుడు బి.రాజబాబుకు చెందిన పాడిగేదెకు ఆరు నెలల క్రితం పొట్ట పైభాగంలో చిన్న కణితిలా వచ్చింది. ఇటీవల కాలంలో అది పెరగడంతో రైతు గేదెను మండపేటలో పశు సంవర్ధక శాఖ శిక్షణ కేంద్రానికి తీసుకొచ్చాడు. వైద్యులు పరీక్షించి అందని కేన్సర్ కణితిగా గుర్తించారు. అక్కడ వైద్యాధికారులు డిడి కె.కష్ణమూర్తి, విఎఎస్‌విజిఎన్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 2 గంటల సెపు శ్రమించి శస్త్ర చికిత్స చేసి 2 కిలోల కణితిని తొలగించారు.

వారం పాటు ఆదిత్యలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్అపోలో సన్‌షైన్ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు వారం రోజులపాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ ఆదిరెడ్డి రమేష్ సోమవారం ప్రారంభించారు. వారం రోజులపాటు విద్యార్థులకు పలు విభాగాల్లో నిపుణులైన వైద్యులతో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పలు ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సోమవారం సుమారు 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ, వాలంటీర్లు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి- కరప

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను ఎస్‌సి, ఎస్‌టి ప్రాంతాల్లో ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేస్తుందని జనసేన పార్టీ పిఎసి సభ్యులు పంతం నానాజీ అన్నారు. పెనుగుదురులో సోమవారం ఎస్‌సి, ఎస్‌టి కాలనీలో, గ్రామ కమిటీ అధ్యక్షులు గంట నానిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను మళ్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.కొండబాబు, బి.గంగాధర్, వై.పండు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

టిడిపిలోకి పలువురు వైసిపి కార్యకర్తలు సోమవారం పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. కొండవరంలో గాది రాజబాబు, వేమగిరి రాంబాబు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి చెందిన పెండ్యాల శివ, మరికొందరు యువత ఈ సందర్భంగా టిడిపిలో చేరారు. వర్మ మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనిసెట్టి సత్యానందరెడ్డి, గాది రాజబాబు, దుళ్ళ సత్తిబాబు, పార్టీ అధ్యక్షులు సత్తిబాబు, వేమగిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాజీ ఎంఎల్ఎ వర్మ

'వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - ఏలేశ్వరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పర్వత

మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలేశ్వరంలో జరిగిన మండల గృహ సారథులు సచివాలయ కన్వీనర్ల శిక్షణా తరగతులకు నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్, రాష్ట్ర దృశ్య కళా చైర్మన్ కుడిపూడి శైలజలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం 93శాతం ఎన్నికల హామీలను అమలు చేసిందన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలమండ సత్యవతి, వైస్ చైర్మన్ శిడగం త్రివేణి, చిక్కాల రాజ్యలక్ష్మి, సాదె లోవరాజు, లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, వైసిపి నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండుగ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

రజకులు ఆధ్వర్యంలో సోమవారం బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. అంగరలో శ్రీ రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఈ పండుగను నిర్వహించారు. విఘ్నేశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. గారడీలు, డప్పు వాయిద్యాలు, బాణా సంచా కాల్పులతో ఊరేగింపు జరిగింది. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. రజక సంఘం పెద్దలు ఎ.సూర్యనారా యణ, టి.వీరబాబు, ఎం.నాగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అవినీతిమయంగా వైసిపి పాలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వ పాలనంతా అవినీతి, దోపిడీల మయంగా మారిందని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. 12వ డివిజనలో సోమవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాలను పంచారు. తొలుత గాంధీ, ఎన్‌టిఆర్ విగ్రహాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, ఒమ్మి బాలాజీ, పేకేటి సూర్య భాస్కరరావు తదిరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు గళ్ల నాగవరలక్ష్మి, డి.సత్యవతి నివాసముంటున్న ఇంటికి సోమవారం తెల్లవారు జామున మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో ఉన్నవారంతా ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఇంటో సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వైసిపి సీనియర్ నాయకులు ఉండ్రాజపు చిన్న, పడమటి రాంబాబు, విఆర్ఒ సుదర్శన్ బాధితులను పరామర్శించారు. కొంత ఆర్థిక సాయాన్ని, రైస్ ప్యాకెట్లను ఇరు కుటుంబాలకు అందించారు. ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని వారు తెలిపారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : బండారు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. బాధితులు నాగవరలక్ష్మి, సత్యవతి కుటుంబాలను ఆయన పరామర్శించారు. బియ్యం, వంట పాత్రలు, దుప్పట్లతో పాటు ఆర్థిక సాయం అందించారు. బాధితులకు సాయం అందించాలని తహశీల్దార్‌తో మాట్లాడారు. ఆయన వెంట కె.కృష్ణ, ఈదల రమేష్, ఎం.ఏడుకొండలు, ఎ.సత్యనారాయణరాజు, జి.మూర్తి, బి.మారుతి, యు.రాజు ఉన్నారు.


సాయం అందిస్తున్న వైసిపి నాయకులు, విఆర్ఒ తదితరులు


సాయం అందిస్తున్న మాజీ ఎంఎల్ఎ బండారు, టిడిపి నాయకులు



శిబిరాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

150 మంది రక్తదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో పెద్దాపురం సాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు శివారులోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. సాయి సేవా సమితి సభ్యులు అద్దేపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి లక్ష్మణరావు, ఎ.రమేష్, రాజేష్, జి.సునీల్, జి.వాసు, హెచ్‌వి.చంద్రశేఖర్‌శర్మ, పి. వేణుగోపాలకృష్ణ, బి.బుజ్జి, పి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి గంగమ్మ జాతర

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెద్దబ్రహ్మదేవం మంచినీటి చెరువు గట్టు వద్ద దొడ్డి గంగమ్మతల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. చింతలూరు కళాకారుల గరగల నృత్యం, డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో తోటకూర గంగాధర్, వారి కుటుంబాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

10 నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని సచివాలయాల్లోని కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులకు ఈనెల 10న తహశీల్దార్ పాత కార్యాలయం ఎదురుగా ఉన్న లే-అవుట్‌లో పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కార్యాలయ అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మొదట గ్రూప్, మధ్యాహ్నం రెండు గంటలకు రెండో గ్రూప్‌నకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

లిబరేషన్ జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- రౌతులపూడి

బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 15న నిర్వహించనున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగా రాజు కోరారు సోమవారం రౌతులపూడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024 సాధారణ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణమూర్తి ఉన్నారు